సాక్షి
రంగారెడ్డి

గురువారం । 12 । అక్టోబర్ । 2023



బొమ్మపై సీసీఎల్‌ఏకు లేఖ

రిజిస్ట్రేషన్ పత్రాలపై సీఎం ఫొటో ఉండడాన్ని పలు పార్టీలు తప్పుపట్టాయి. దీనిపై సీసీఎల్ ఏకు లేఖ రాసినట్టు కలెక్టర్ తెలిపారు. 10లో▸



అభివృద్ధిని ప్రచారం చేయండి

సీఎం కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని కాలర్ ఎగరేసుకుని మరీ ప్రచారం చేసుకోవచ్చని మంత్రి సబితారెడ్డి అన్నారు. 10లో▸



బీఆర్‌ఎస్‌దే అధికారం

రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

సాగులో మెలకువలు పాటించాలి



పంటల నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

కేశంపేట: పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన పంటల నమోదు ప్రక్రియను బుధవారం ఆమె పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పంటల నమోదును సర్వేనంబర్ ఆధారంగా చేపడుతున్నట్లు తెలిపారు. దీని ఆధారంగానే ప్రభుత్వం కొనుగోళ్లు చేపడుతుందని ఆమె అన్నారు. దళారీ వ్యవస్థకు సంబంధం లేకుండా రైతులు పంటలను అమ్ముకోవడం సులువు అవుతుందని తెలిపారు.

గంజాయి, అక్రమ మద్యం పట్టివేత



పోలీసుల అదుపులో నిందితులు

హయత్‌నగర్: ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఆంధ్రా నుంచి హైదరాబాద్ మీదుగా కర్ణాటకకు ట్రావెల్స్ వాహనంలో తరలిస్తున్న గంజాయి, అక్రమ మద్యాన్ని హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని.. ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ కథనం ప్రకారం.. ఏపీకి చెందిన మాలేపు అజిత్‌కుమార్, రోమియో మార్క్ రోడ్రిగ్స్ విశాఖపట్నం జిల్లా పాడేరు, నర్సీపట్నం ప్రాంతాల నుంచి గంజాయిని కిలో సుమారు రూ.6 వేలకు కొని కర్ణాటకలోని దావనగేరిలో రూ.25 వేల చొప్పున విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో సుమారు 8.3 కిలోల గంజాయి, పన్ను చెల్లించని 9 మద్యం బాటిళ్లను ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్టు సమీపంలోని ఫిలింసిటీ వద్ద తనిఖీ చేపట్టారు. బస్సులో 8.3 కిలోల గంజాయి, 9 మద్యం బాటిళ్లు బయట పడ్డాయి. వాటిని తరలిస్తున్న అజిత్‌కుమార్, మార్క్ రోడ్రిగ్స్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. తనిఖీల్లో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్‌కుమార్, సీఐలు శ్రీనివాస్, సుభాష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మేడ్చల్ అభ్యర్థిగా ఈటల జమున?



మేడ్చల్: మొదటి నుంచీ ఈటల కుటుంబానికి మేడ్చల్ నియోజకవర్గానికి సమీప సంబంధాలు ఉండటంతో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున మేడ్చల్ నుంచి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సతీమణి జమునను రంగంలోకి దించేందుకు ఆ పార్టీ అధిష్టానం వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈటల రాజేందర్ మేడ్చల్ మండల పరిధిలోని పూడూర్ దగ్గర ఔటర్ రింగురోడ్డు సమీపంలో నివాసముంటున్నారు. ఆయన గోదాంలు, గతంలో పౌల్ట్రీలు, ఇతర వ్యాపారాలు నియోజకవర్గ పరిధిలోనే ఉండటంతో వారి కుటుంబానికి మేడ్చల్‌కు చాలా రోజులుగా సత్సంబంధాలు ఉన్నాయి. జమున నివాసం పూడూర్ పరిధిలో ఉండటంతో పాటు స్థానిక నాయకులతో పరిచయాలు ఉన్నాయి. ఈటలకు అర్థ బలం పరిపుష్టిగా ఉండటం, టికెట్ ఆశిస్తున్న మిగతావారికి ఆ బలం లేకపోవడం, రాజేందర్ బీసీ అయినా జమున రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు కావడం, ఆ సామాజికవర్గ పెత్తనం మేడ్చల్‌లో ఎక్కువగా ఉండటంతో ఆమె అభ్యర్థిత్వం తమకు కలిసి వస్తుందని బీజేపీ అధిష్టానం ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు బీజేపీ మేడ్చల్ టికెట్ తన భార్య జమునకు కేటాయించాలని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అధిష్టానాన్ని కోరినట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం

శంషాబాద్: ఒలింపిక్స్‌లో విజయం సాధించడమే తన ముందున్న లక్ష్యమని ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ నిఖిత్ జరీన్ అన్నారు. ఏషియన్ గేమ్స్‌లో జరిగిన బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన ఆమె బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో క్రీడాభిమానులు, తెలంగాణ స్పోర్ట్స్ విభాగం అధికారులు, కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవిష్యత్తులో జరిగే ఆటలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు మరింత పట్టుదలగా కృషి చేస్తానన్నారు.

నువ్వా.. నేనా!

రసవత్తరంగా జిల్లా రాజకీయం


- ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్‌ఎస్
- పోటాపోటీగా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు

రాష్ట్రంలోనే కొంత భిన్నమైన జిల్లా రంగారెడ్డి. సెమీ అర్బన్‌గా జిల్లాగా ఇది ప్రత్యేక గుర్తింపు పొందింది. రాజకీయ చైతన్యం కాస్త ఎక్కువ ఉన్న ప్రాంతం కూడా ఇదే. ఇక్కడ కేవలం తెలుగు రాష్ట్రాలకు చెందిన ఓటర్లు మాత్రమే కాదు ఉత్తరాది ప్రాంతాలకు చెందిన భిన్న కులస్తులు, మతస్తులు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. అత్యధికంగా శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో ఉన్నారు. వీరి ఓట్లు ఎన్నికల్లో కీలకం కాబోతున్నాయి. సీట్లు ఖరారు కావడంతో అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఇప్పటికే నియోజకవర్గాలను ఓ దఫా చుట్టేశారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, కాలనీ సంక్షేమ సంఘాలు, కుల సంఘాలు, గేటెడ్ కమ్యూనిటీ సంక్షేమ సంఘాలతో ఆత్మీయ సభలు, సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీలతో పోలిస్తే కొంత ముందున్నట్లు కనిపిస్తోంది. విపక్షాలు అభ్యర్థుల పేర్లు ఇంకా అధికారికంగా వెల్లడించకపోయినా.. ఆయా పార్టీలు సైతం ఓటర్లను ఆకర్షించేందుకు పోటాపోటీగా కార్యక్రమాలు చేపడుతున్నాయి. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నాయి.

– సాక్షి, రంగారెడ్డి జిల్లా

టికెట్లు రాకున్నా ఎవరికి వారే ప్రచార పర్వం

సెగ్మెంట్ రిపోర్ట్



విద్యాశాఖ మంత్రి పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం ఇది. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు వరకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో ఆమె బిజీగా ఉన్నారు. రోజుకు కనీసం 12 గంటలు నియోజకవర్గంలోనే పర్యటించారు. బీజేపీ, కాంగ్రెస్‌తో పోలిస్తే.. ఎన్నికల ప్రచారంలో ఆమె కొంత ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం. అదే విధంగా బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న అందెల శ్రీరాములు సైతం పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ తప్పిదాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు, ఇళ్ల స్థలాల పంపిణీ వంటి అంశాల్లో స్థానికులకు జరిగిన అన్యాయాన్ని ఎత్తి చూపుతూ.. ఎప్పటికప్పుడు అధికార పార్టీ టార్గెట్‌గా ముందుకెళ్తున్నారు. ఈ సీటును హస్తగతం చేసుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ ఇదే నియోజకవర్గం వేదికగా ఇటీవల భారీ బహిరంగ సభను నిర్వహించింది. ఆశించిన దానికంటే అధిక సంఖ్యలో జనం రావడంతో ఆ పార్టీకి కొత్త ఊపునిచ్చింది. తీరా టికెట్ల కేటాయింపు అంశం వివాదాస్పదంగా మారింది. ఇక్కడి నుంచి బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పోటీ చేయనున్నారనే ప్రచారం జరిగింది. ఆయన కూడా ఇందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పటి వరకు ఫీక్ స్టేజీలో ఉన్న కాంగ్రెస్.. ఇటీవల బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి చేసిన ఆరోపణలతో రాజకీయంగా కోలుకోలేని స్థితికి చేరింది. సంస్థాగతంగా పార్టీ బలంగా ఉన్నప్పటికీ.. నేతల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు పార్టీకి నష్టం తెచ్చిపెట్టే విధంగా ఉన్నాయి. ఆశావహులంతా అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పని చేస్తారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

సిట్టింగ్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేసే ప్రక్రియలో బిజీగా ఉంటున్నారు. నియోజకవర్గానికి కొంత అభివృద్ధి పథంలో నడిపించారు. కాంగ్రెస్ నుంచి అధికారికంగా అభ్యర్థి పేరు వెల్లడించకపోయినప్పటికీ.. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పోటీలో ఉండనున్నట్లు సమాచారం. ఆయన ఇప్పటికీ గ్రామాల వారీగా పర్యటిస్తూ బూత్ కమిటీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. సంస్థాగతంగా పార్టీకి మంచి పట్టుండటం ఆయనకు కలిసి వచ్చే అంశం. ఇక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న ఆశావహులు మర్రి నిరంజన్‌రెడ్డి, దండెం రామిరెడ్డిలు ఆయనకు సహకరిస్తారా? లేదా? వేచి చూడాల్సిందే. ఇక్కడ బీజేపీ పెద్దగా ప్రచారంలో లేకపోవడంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్య ప్రధాన పోటీ నెలకోనుంది.

పూర్తిగా అర్బన్ ఓటర్లు ఉన్న ప్రాంతం ఇది. ఇక్కడ తెలంగాణ, ఏపీ జిల్లాలకు చెందిన సెటిలర్ ఓటర్లు అధికం. సిట్టింగ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి బీఆర్‌ఎస్ మళ్లీ అవకాశం కల్పించింది. గత ఎన్నికల్లో చేతి గుర్తుపై గెలుపొందిన ఆయన ఈసారి కారు గుర్తుతో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇక్కడ బీజేపీకి సంస్థాగతంగా బలంగా ఉంది. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ 11 డివిజన్లకు 10 డివిజన్లలో విజయం సాధించింది. ఇక్కడి నుంచి అర్బన్‌జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డితో పాటు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేరు ప్రముఖంగా ప్రచారం జరుగుతోంది. ఇక కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ మధుయాష్కీ పేరు దాదాపు ఖరారైంది. అధికారికంగా పేరు వెల్లడించక పోయినా.. అంతర్గతంగా ఆయన ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. నియోజకవర్గంలో ముక్కోణపు పోటీ నెలకొనే అవకాశం లేకపోలేదు.

రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గం శేరిలింగంపల్లి. ఇక్కడ 6,98,133 మంది ఓటర్లు ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మళ్లీ తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ప్రచారంలో ఆయన దూసుకుపోతున్నారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ తనయుడు రవికుమార్ యాదవ్‌కు టికెట్ దాదాపు ఖరారైనట్లే. ఆయన అధికార పార్టీకి గట్టిపోటీ ఇచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ నుంచి యువ నేత రఘునాథ్ యాదవ్ పేరు దాదాపు ఖరారైనట్లు తెలిసింది. ఈయన కూడా ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అయితే.. ఇక్కడ అధికార బీఆర్‌ఎస్, బీజేపీల మధ్యే ప్రధానంగా పోటీ ఉండే అవకాశం కనిపిస్తోంది.

బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కే మళ్లీ టికెట్ వరించింది. ఇతర పార్టీలతో పోలిస్తే ఆయన ప్రచారంలో కొంత ముందున్నారు. బీజేపీ నుంచి పలువురు ఆశావహులు పోటీపడుతున్నారు. వీరిలో ముఖ్యంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అధికారికంగా అభ్యర్థి పేరు వెల్లడించక పోయినా.. వీరిలో తోకల శ్రీనివాస్‌రెడ్డి ఇప్పటికే ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. కాంగ్రెస్ నుంచి జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గౌరీ సతీష్, నరేందర్ ముదిరాజ్ పోటీ పడుతున్నారు. ఎంఐఎం కూడా తమ అభ్యర్థిని బరిలో నిలిపే అవకాశం ఉంది. ఇక్కడ బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మధ్యే ప్రధానంగా పోటీ ఉండే అవకాశం ఉంది.

షాద్‌నగర్.. షహన్‌షా ఎవరో..

పరిశ్రమలకు నెలవైన ప్రాంతం ఇది. బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కే మళ్లీ అవకాశం దక్కింది. అభివృద్ధి పనులకు అధిక నిధులు తెప్పించడంలోనే కాదు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందజేయడంలో, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే ఆయన ముందున్నారు. సంస్థాగతంగా ఆయనకు పెద్దగా వ్యతిరేకత లేకపోయినప్పటికీ.. ఇదే పార్టీ నుంచి టికెట్ ఆశించిన వారు ఎటు వైపు మొగ్గు చూపుతారనేది ప్రశ్నార్థకంగా మారింది. కాంగ్రెస్ నుంచి వీర్లపల్లి శంకర్ పేరు దాదాపు ఖరారైంది. ఈయన బీఆర్‌ఎస్ అభ్యర్థికి గట్టి పోటీ ఇవ్వనున్నట్లు సమాచారం. ఇక బీజేపీ నుంచి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య సహా పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లో పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ముందు వరుసలో నిలిచారు.

కల్వకుర్తి.. ఎవరిదో కుర్చీ?

భిన్నమైన నియోజకవర్గం ఇది. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలు రంగారెడ్డిలో ఉంటే కల్వకుర్తి మాత్రం నాగర్‌కర్నూలు జిల్లాలో ఉండడం విశేషం. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేరును ప్రకటించినప్పటి నుంచి ఊరూరా తిరుగుతూ ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. టికెట్ ఆశించిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఇటీవల పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కల్వకుర్తి నుంచి కాంగ్రెస్ తరఫున ఆయన బరిలో దిగడం దాదాపు ఖాయమైంది. వరుస ఓటములతో పోరాడుతున్న బీజేపీ అభ్యర్థి ఆచారి ఆరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. అధికారికంగా ఇప్పటి వరకు పేరు ప్రకటించకపోయినప్పటికీ.. ఈసారి కూడా ఆయనే పోటీలో ఉండనున్నారు.

చేవెళ్ల.. ఎవరికో

ఎస్సీ రిజర్వ్డ్ స్థానం ఇది. అధికార బీఆర్‌ఎస్‌కు మంచి పట్టుంది. సిట్టింగ్ ఎమ్మెల్యే కాలె యాదయ్యకే మళ్లీ అవకాశం కల్పించడంతో అభివృద్ధి, సంక్షేమ పథకాల పంపిణీలోనే కాదు ప్రచారంలోనూ ముందుకు సాగుతున్నారు. కారు వేగాన్ని అందుకునే నేతలు కాంగ్రెస్, బీజేపీలో లేకపోవడం ఆయనకు కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి సంస్థాగతంగా సంప్రదాయ ఓటు బ్యాంకు, బలమైన కేడర్ ఉన్నప్పటికీ.. ఆస్థాయి అభ్యర్థి లేకపోవడం, రోజుకో పేరు బయటికి వస్తుండటం కేడర్‌ను అయోమయంలోకి నెట్టేస్తోంది. షాబాద్ దర్శన్, వసంతం, భీంభరత్ టికెట్ ఆశిస్తున్నారు. బీజేపీ నుంచి ముగ్గురు పోటీపడుతున్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉండనుంది.

భూమాతను కాపాడుకుందాం

కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి

కడ్తాల్: సర్వప్రాణుల సేవయే మాధవసేవగా భావించి భూమాతను కాపాడుకోవాలని కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి అన్నారు. అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఫలక్‌నుమా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు నిర్వహించిన 'ఎర్త్ లీడర్‌షిప్ ఫర్ సస్టైనబుల్ – మేరా మిట్టి మేరాదేశ్' శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆనందకరమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయాలంటే విద్యార్థుల్లో సమగ్ర పరివర్తన జరగాలని సూచించారు. పర్యావరణ రక్షణలో విద్యార్థులు ప్రధాన భూమిక పోషించాలని పిలుపునిచ్చారు. సహజ వనరులు సగానికి పైగా కరిగిపోయాయని, నేడు ప్రపంచం పర్యావరణ సంక్షోభం ముంగిట నిలబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి తరంతో పాటు, రేపటి తరాల సుస్థిరతకు భంగం వాటిల్లకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ జీవించాలని సూచించారు. డాక్టర్ తులసీరావు మాట్లాడుతూ.. అంతరించిపోతున్న జీవజాతులను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని గుర్తు చేశారు. నల్లమల అడవుల్లో ఉన్న జీవ జాతుల జీవన విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ శశికళ, సీజీఆర్ ప్రోగ్రాం నిర్వాహకులు రత్తం వెంకటేశ్, నగేశ్, బాల చైతన్య కేంద్రాల నిర్వాహకులు రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లీలా లక్ష్మారెడ్డి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి

షాద్‌నగర్: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కమల అధ్యక్షతన బుధవారం యూత్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. నేడు మానవాళి ఎదుర్కొంటున్న అతిపెద్ద ముప్పు పర్యావరణ వినాశనమని పేర్కొన్నారు. మానవ తప్పిదాలతోనే పర్యావరణం వినాశనమవుతుందని అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్ తరాలకు తాగునీరు దొరకని పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్మసేవ సంస్థ చైర్మన్ నిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ధర్మసేవ సంస్థ ద్వారా డిగ్రీ స్థాయి విద్యార్థులకు మంచి నడవడికపై కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, మంచి నడవడిక, మానసిక ఆరోగ్య సమస్యలువంటి వాటిపై కౌన్సెలింగ్ ఇవ్వడం, ఆనందదాయకమైన కార్యక్రమాలను నిర్వహించేందుకు కమిటీలు వేయడం, ఆ కమిటీల్లో విద్యార్థులను భాగస్వాములను చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి

సంచలన బదిలీలు

నగర కొత్వాల్ సీవీ ఆనంద్, రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లకు స్థానచలనం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని రెండు జిల్లాల కలెక్టర్లు, నగర పోలీస్ కమిషనర్ బదిలీ వార్త బుధవారం రాత్రి రాజధాని నగరంలో సంచలనం రేకెత్తించింది. అసెంబ్లీ ఎన్నికల బదిలీల్లో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం గ్రేటర్ హైదరాబాద్‌తో కలగలసి ఉన్న పొరుగు జిల్లాల కలెక్టర్లతో పాటు నగర పోలీస్ కమిషనర్‌పై బదిలీ వేటు వేయడం టాక్ ఆఫ్ ద సిటీగా మారింది. గ్రేటర్‌లోని వివిధ అధికార వర్గాల్లో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. దాదాపు రెండు నెలల క్రితం నుంచే ఎన్నికల నేపథ్యంలో పలు కీలకస్థానాల్లోని అధికారుల బదిలీలు జరిగాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడ్డాక.. రాష్ట్రానికి గుండెకాయ వంటి రాజధాని కేంద్రమైన హైదరాబాద్‌పై ప్రభావం చూపేలా తలవని తలంపుగా.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్, మేడ్చల్ కలెక్టర్ అమోయ్‌కుమార్‌లపై బదిలీ వేటు పడటంతో ఆయా విభాగాలు ఉలిక్కిపడ్డాయి. వీరిద్దరూ జిల్లా కలెక్టర్లుగా బాధ్యతలు చేపట్టి దాదాపు ఆర్నెల్లు మాత్రమే అయింది. వీరితో పాటు నగర పోలీస్ కమిషనర్‌గా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను సైతం బదిలీ చేయడంతో పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జనాభా రీత్యా, అభివృద్ధి దృష్ట్యా, ఆర్థిక వనరుల పరంగా అన్నింటా రాష్ట్రంలో కీలకంగా ఉండటంతో పాటు ఓటర్లలోనూ మూడో వంతు ఉన్న గ్రేటర్ పరిధిలోని వీరిని బదిలీ చేయడం అన్ని వర్గాల ప్రజలనూ నివ్వెరపోయేలా చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి వీరు కళ్లు, చెవులుగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాలు మెజార్టీ ప్రజల్లో ఉన్నాయి. జిల్లాల కలెక్టర్లుగా ఇద్దరు కలెక్టర్లు రెండు జిల్లాల ఎన్నికల అధికారులుగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌పై సైతం ప్రభావం పడనుందా అన్న ప్రశ్నలు తాజాగా ఉత్పన్నమవుతున్నాయి. గతంలో 2008లో వికారాబాద్ ఉప ఎన్నిక సందర్భంగా అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ ప్రకాశ్‌ను ఇలాగే ఎన్నికలకు ముందు బదిలీ చేయడాన్ని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. బదిలీ అయిన కలెక్టర్ల స్థానంలో గురువారం సాయంత్రం 5 గంటల్లోపు నియామకాలకు ప్యానల్ పంపాల్సిందిగా ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

సరిహద్దుల్లో 18 చెక్ పోస్టులు

- తనిఖీల కోసం ప్రత్యేక బృందాలు
- నగర కొత్వాల్ సీవీ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నగరంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పటిష్ట చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించి అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేయడానికి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో అవసరమైన నివేదికలను సకాలంలో తయారు చేయాలని స్పష్టం చేశారు. సిబ్బంది విధులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, బలగాలకు నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎన్నికల క్రతువు ముగిసే వరకు ప్రతిరోజూ ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆనంద్ ఆదేశించారు. డీసీపీలు, ఏసీపీలతో పాటు నోడల్ అధికారులుగా ఉన్న అధికారులు సైతం ఎప్పటికప్పుడు తమ స్థాయిల్లో సమీక్షలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ అధికారులు తమ కార్యాలయాల్లో నిర్విరామంగా పని చేసేలా ప్రత్యేక సెల్స్ ఏర్పాటు చేయాలని, వీటిలో అనుభవజ్ఞులైన సిబ్బందిని నియమించుకోవాలని కొత్వాల్ పేర్కొన్నారు. అక్రమ మద్యం, నగదు, మాదకద్రవ్యాలతో పాటు ప్రలోభాలకు వినియోగించే ఇతర సామగ్రి పట్ల అప్రమత్తంగా ఉండాలని, వీటిని ఎక్కడిక్కడ అడ్డుకోవాలని స్పష్టం చేశారు. నగరంలోని లైసెన్స్‌డ్ ఆయుధాలు కలిగి ఉన్న వారంతా వాటిని డిపాజిట్ చేసేలా స్థానిక పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆనంద్ పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ ఇంటర్ కమిషనరేట్ చెక్‌పోస్టుల సంఖ్యను 11 నుంచి 18కి పెంచామన్నారు. అదనపు సీపీ, ఎలక్షన్ సెల్ ఇన్‌చార్జ్ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ.. నోడల్ అధికారులుగా ఉన్న ఏసీపీలు సమన్వయంతో పని చేయాలని, విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని పేర్కొన్నారు. స్పెషల్ బ్రాంచ్ అదనపు సీపీ ఎం.విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. నకిలీ ఓటర్ ఐడీ ముఠాలతో పాటు రవాణా సంస్థలు, కొరియర్ సర్వీసుల పైనా నిఘా ఉంచాలని కోరారు. సమావేశంలో అదనపు సీపీ సుధీర్‌బాబు, ట్రాఫిక్ విభాగం సంయుక్త సీపీ ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు. కాగా.. గత రెండు రోజుల్లో పోలీసులు రూ.4.2 కోట్ల విలువైన 7.706 కేజీల బంగారం, రూ.8.77 లక్షల విలువైన 11.700 కేజీల వెండి, రూ.5.1 కోట్ల నగదు, 110 లీటర్ల మద్యం. 23 మొబైల్ ఫోన్లు, 43 క్వింటాళ్ళ రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థులకు అభినందన

హుడాకాంప్లెక్స్: ఎంహెచ్‌ఆర్‌డీ స్కాలర్‌షిప్‌కు సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక య్యారు. 2023 మార్చి వార్షిక పరీక్షల్లో హేమలత ఇంటర్-ఎంపీసీ, అరుణ్‌కుమార్-ఎంపీసీ, విష్ణు-సీఈసీ విద్యార్థులు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ జారీ చేయు ఉపకార వేతనం పొందుటకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జి.రాణి తెలిపారు. బుధవారం విద్యార్థులను ప్రిన్సిపాల్ రాణి, సహ అధ్యాపకులు అభినందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని

ఒకరి మృతి


సాయిలు మృతదేహం

ఆమనగల్లు: పట్టణ సమీపంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆమనగల్లుకు చెందిన నాగిళ్ళ సాయిలు(60) దుర్మరణం చెందాడు. ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు పట్టణానికి చెందిన నాగిళ్ళ సాయిలు మంగళవారం రాత్రి గ్రామ శివారులో ఉన్న పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా పట్టణ సమీపంలోని సేవాలాల్ గుట్ట వద్ద హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీఎం బొమ్మపై సీసీఎల్‌ఏకు లేఖ

- జీఓ నంబర్ 59 భూముల రిజిస్ట్రేషన్లపై ఫొటో
- రూ.1.62.65.360 నగదు, 24 లీటర్ల మద్యం సీజ్
- వచ్చే ఎన్నికల్లో గేటెడ్ కమ్యూనిటీల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కృషి
- అన్ని పార్టీలకు సమ ప్రాధాన్యం కల్పిస్తాం
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ హరీశ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ఆక్రమిత ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ(జీఓ నంబర్ 59)లో భాగంగా లబ్ధిదారులకు అందజేస్తున్న రిజిస్ట్రేషన్ పత్రాలపై సీఎం ఫొటో ప్రచురించిన విషయం విదితమే. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆయా రిజిస్ట్రేషన్ పత్రాలపై సీఎం ఫొటో ఉండటాన్ని పలు రాజకీయ పార్టీలు తప్పు పడుతున్నాయి. ఇదే అంశాన్ని సీసీఎల్‌ఏకు వివరించాను. ఈ మేరకు ఇటీవల ఓ లేఖ కూడా రాశాను' అని జిల్లా కలెక్టర్ హరీష్ చెప్పారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్‌కు ముందు అమల్లో ఉన్న సంక్షేమ పథకాలు, పత్రాలపై అధికార పార్టీ మంత్రుల పేర్లు, ఫొటోలు ఉండటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వీటిని సీసీఎల్‌ఏ దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఎన్నికల కమిషన్ ఏ ఒక్క పార్టీకి అనుకూలం కాదు. ఎన్నికలు, సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తుంది. సభలు, సమావేశాలు, ప్రచారం వంటి అంశాల్లో అన్ని పార్టీలకు సమప్రాధాన్యత ఇస్తుంది.

70 మంది బైండోవర్

ఓటర్లను భయాందోళనలకు గురి చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోం. ఇప్పటికే 70మంది వీధి రౌడీలను బైండోవర్ చేశాం. నేతలు, ఇతర వ్యాపారుల వద్ద ఉన్న 58 ఆయుధాలను సరెండర్ చేయించాం. తనిఖీల్లో భాగంగా బుధవారం వరకు జిల్లాలో రూ.1, 62,65,360 నగదు స్వాధీనం చేసుకున్నాం. 24 లీటర్ల మద్యం బాటిళ్లను సీజ్ చేశాం.. ఆస్పత్రి బిల్లుల చెల్లింపు, ఇతర అవసరాల కోసం అంతకు మించి నగదు తీసుకెళ్లే వారు సంబంధిత పత్రాలను వెంట తీసుకెళ్లడం ఉత్తమం. ఇందుకోసం జిల్లా స్థాయిలో గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశాం. జెడ్పీ సీఈఓ దీనికి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

1206 సమస్యాత్మక కేంద్రాలు

జిల్లాలో మొత్తం 33,56,056 మంది ఓటర్లు ఉన్నారు. 16,15,876 మంది మహిళా ఓటర్లు, 17,38,994 మంది పురుష ఓటర్లు, 596 మంది ఇతర ఓటర్లు, 590 సర్వీసు ఓటర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,369 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. 1206 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించాం. మరో 10 అతి క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. భారీ పోలీసు బందోబస్తుతో పాటు మైక్రో అబ్జర్వర్స్ పరిశీలనలో ఉండనున్నాయి. ఎంసీఎంసీ, సోషల్ మీడియా బృందాలు పని చేస్తాయి. ఎన్నికల ఖర్చు కోసం రేట్ చార్ట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చాం.

కోడ్ ఉల్లంఘిస్తే.. కేసులే..

ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించే వారిపై సంబంధిత చట్టాలను అనుసరిస్తూ కేసులు నమోదు చేస్తాం. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే లౌడ్ స్పీకర్లకు అనుమతి ఉంది. ఆ తర్వాత వాడితే కేసులు నమోదు చేస్తాం. కోడ్ ఉల్లంఘనలపై ప్రజలు నేరుగా 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఈసారి కొత్తగా సీ-విజిల్ యాప్‌ను అందుబాటులో తెచ్చింది. ఈ యాప్ ద్వారా కోడ్ ఉల్లంఘన అంశాలు లైవ్ ఫోటోలు, వీడియోలు తీసి ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకురావొచ్చు. ఫిర్యాదు చేసిన వంద నిమిషాల్లో భద్రత, తనిఖీ బృందాలు ఘటనా స్థలికి చేరుకుంటాయి. 80 ఏళ్ళు పైబడిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటు కల్పిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది.

అందుబాటులో 'సువిధ' పోర్టల్

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో సభలు, సమావేశాలకు అనుమతి లేదు. విధిగా వాటికి అనుమతి తీసుకోవాలి. ఆఫ్‌లైన్‌లో కాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. ఇందుకోసం ఎన్నికల కమిషన్ 'సువిధ' పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎవరు ముందు దరఖాస్తు చేసుకుంటే వారికే ముందు అనుమతి ఇస్తాం. దరఖాస్తు చేసిన 24 గంటల్లోనే అనుమతులు జారీ చేస్తాం. అంతేకాదు ఫ్లెక్సీ తయారీ మరియు ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు కూడా జాగ్రత్తగా ఉండాలి. రాజకీయ పార్టీలు ముద్రించే కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ప్రింట్ చేసినప్పుడు వాటిపై ఫర్మ్ పేరు , ప్రింటర్ పేరు, ఫోన్ నెంబర్ విధిగా ముద్రించాలి. ప్రింటింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో రిజిస్టర్లు నిర్వహించాలి. లేదంటే వారిపై చర్యలు తప్పవు.

ఏ ఒక్క పార్టీకి అనుకూలం కాదు:

ఎన్నికల షెడ్యూలు రాగానే ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. అందరూ ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి పని చేయాల్సిందే. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఈ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఏ ఒక్క పార్టీ వైపు మొగ్గు చూపినట్లు కన్పించినా...ప్రచార సభల్లో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ పాల్గొన్నా..అభ్యర్థుల తరఫున ప్రచారం చేసినా...అట్టి వారిపై చర్యలు తప్పవు. ఎన్నికల సంఘం ఏ ఒక్క పార్టీకి అనుకూలం కాదు.

వచ్చే ఎన్నికల నాటికి అక్కడ కూడా పోలింగ్ కేంద్రాలు


జిల్లాలో అనేక గేటెడ్ కమ్యూనిటీలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్నాయి. 1200పైగా ఓటర్లు ఉన్న ఆయా గేటెడ్ కమ్యూనిటీల్లోనూ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించాం. ఆ మేరకు 40 గేటెడ్ కమ్యూనిటీలకు నోటీసులు ఇచ్చాం. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఒక గేటెడ్ కమ్యూనిటీ మినహా ఇతరులు ముందుకు రాలేదు. ఏదీ ఏమైనా వచ్చే ఎన్నికల నాటికి గేటెడ్ కమ్యూనిటీల్లోనూ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి తీరుతాం.

మహిళ దారుణ హత్య

పరారీలో అనుమానితురాలు

షాద్‌నగర్‌రూరల్: మహిళ దారుణ హత్యకు గురైన ఘటన మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి రైల్వేగేటు సమీపంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డీఐ రాంరెడ్డి వివరాల ప్రకారం.. చటాన్‌పల్లి సమీపంలోని కావలిగుండు తండాకు చెందిన లక్ష్మి భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటుంది. లక్ష్మి రూం పక్కనే సోనీ (హిజ్రా) నివాసం ఉంది. గత కొంతకాలంగా లక్ష్మి, సోనీ చిన్నచిన్న విషయాలకు గొడవపడే వారు. ఈ క్రమంలో తన తల్లి లక్ష్మిని చూసేందుకు మహబూబ్‌నగర్ సమీపంలోని బండమీదపల్లి నుంచి పెద్ద కూతురు సరిత బుధవారం షాద్‌నగర్‌కు వచ్చింది. తల్లి కనిపించకపోవడంతో పక్కనే ఉంటున్న సోనీ (హిజ్రా) రూంకు తాళం వేసి ఉంది. ఆమెపై అనుమానంతో సరిత పోలీసులకు సమాచారం ఇచ్చింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సోనీ రూం నుంచి దుర్వాసన వస్తుండడంతో తలుపులు తీసి చూడగా లక్ష్మి రక్తపు మడుగులో పడి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానితురాలు సోనీ పరారీలో ఉంది. మృతురాలి కూతురు సరిత ఫిర్యాదు మేరకు డీఐ రాంరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి


కుమార్(ఫైల్)

మొయినాబాద్: పనికి వెళ్లి యువకుడు చెరువులో శవమై తేలిన ఘటన మండలంలోని చిలుకూరులో బుధవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సజ్జన్‌పల్లికి చెందిన వడ్డె కుమార్(28) కేతిరెడ్డిపల్లి చెందిన రమేష్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం పనికి వెళ్లాడు. రాత్రి తిరిగి ఇంటికి రాలేదు. కాగా, బుధవారం మధ్యాహ్నం మండలంలోని చిలుకూరు పెద్ద చెరువులో కుమార్ మృతదేహం నీళ్లపై తేలింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దివ్యాంగులకు పథకాలు ఇవ్వాలి

ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శంకర్

ఆమనగల్లు: దివ్యాంగులకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అందించాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు శంకర్ కోరారు. దివ్యాంగులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్ప పథకాలు అందించడం లేదని ఆయన ఆరోపించారు. మాడ్గుల మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన మండల దివ్యాంగుల సంఘం సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బొడ్డు శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో శంకర్ మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో 12 వేలకు పైగా దివ్యాంగుల ఓట్లు ఉన్నాయని, కల్వకుర్తి ఎమ్మెల్యే గెలుపులో దివ్యాంగుల ఓట్లు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. దివ్యాంగులకు ఆసరా పింఛన్లు మాత్రమే ఇస్తున్నారని మిగతా సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. సమావేశంలో దివ్యాంగుల సంఘం జిల్లా కో కన్వీనర్ కొండల్‌గౌడ్, మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, నాయకులు గణేశ్, లింగం, బిక్కు, యాదయ్య, అచ్చయ్య, పర్వతాలు, శాంతి, భవాని తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రచారం చేయండి

మంత్రి సబితారెడ్డి


మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

కందుకూరు: సీఎం కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని కాలర్ ఎగరేసుకుని మరీ ప్రచారం చేసుకోవచ్చని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కార్యకర్తలకు సూచించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ అధ్యక్షతన బుధవారం మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందాయన్నారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి అందరికీ తెలుసన్నారు. నా స్వార్థం కోసం నేను పార్టీ మారలేదని, ప్రజల బాగు కోసమేనని తెలిపారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కొత్తగా ఏర్పాటు చేస్తున్న మెడికల్, లా, డిగ్రీ తదితర కళాశాలల నిర్మాణానికి చేస్తున్న కృషిని ప్రచారం చేయాలన్నారు. నియోజకవర్గంలో తనను మరోమారు ప్రజలు ఆశీర్వదించేలా కార్యకర్తలు కలిసి పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, పార్టీ మహిళా అధ్యక్షురాలు ఇందిర దేవేందర్, సీనియర్ నాయకులు దశరథ, కృష్ణ రాంభూపాల్‌రెడ్డి, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, అంజయ్యగౌడ్, పాండుగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, భిక్షపతి, సదానంద్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, లచ్చానాయక్, రాములు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌దే మూడోసారి అధికారం

- అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరికలు
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. బుధవారం ఎంపీటీసీ కుమార్ ఆధ్వర్యంలో పోలెపల్లి, కొత్తకుంట తండా, మంగళికుంటతండా, చెన్నంపల్లి గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు దేశానికి ఆదర్శమన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో మరోసారి విజయం సాధించి అధికారంలోకి వస్తుందని తెలిపారు. విపక్ష పార్టీలు మాయమాటలు, అమలు చేయలేని వాగ్దానాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అర్జున్‌రావ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, సర్పంచులు శ్రీనయ్య, శోభా చందునాయక్, ప్రేమలత, యాదిరెడ్డి, నాయకులు సయ్యద్ ఖలీల్, జాన్యానాయక్ పాల్గొన్నారు.

దళితబంధుపై నిలదీత

అర్హులైన వారికి దళితబంధు పథకం ఇవ్వాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను మాడ్గుల మండలం చంద్రాయణపల్లి గ్రామానికి చెందిన దళితకుటుంబాలు డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్ళుగా నీ వెంట ఉంటున్నాం. నీకు ఓటు వేస్తున్నాం... కానీ మాకు దళితబంధు ఇవ్వడం లేదంటూ పలువురు ఎమ్మెల్యేను నిలదీశారు. నాయకులు చెప్పినవారికే దళితబంధు ఇస్తే ఎలాని ప్రశ్నించారు. అర్హులైన వారికే దళితబంధు అందిస్తామని ఎమ్మెల్యే వారికి చెప్పారు.

అవార్డుకు ఎంపిక


ఆహ్వాన పత్రం అందజేస్తున్న రాధాకృష్ణ

షాబాద్: మండలంలోని చిన్న సోలీపేట్‌కు చెందిన తురుపల్లి సునంద బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ కమిటీ ఆఫ్ ఇండియా జాతీయ ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. బుధవారం నగరంలోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అవార్డు సెలెక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ అవార్డుకు ఎంపికయిన ఆహ్వాన పత్రం సునందకు అందజేశారు. 15న న్యూఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా బహుజన రైటర్స్ నాల్గవ నేషనల్ కాన్ఫరెన్స్‌లో అవార్డును అందించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరోకరికి గాయాలు


శివకుమార్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: పెట్రోల్ ట్యాంకర్ ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరోకరికి స్వల్ప గాయాలైన ఘటన మంగళవారం రాత్రి ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని సాగర్ హైవేపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం పోచారం గ్రామానికి చెందిన ఎం వినయ్‌కుమార్‌తో కలిసి అదే గ్రామానికి చెందిన తాళ్ళపల్లి శివకుమార్(28) బైక్‌పై తుర్కయంజాల్ వెళ్లారు. తిరిగి వస్తుండగా మన్నెగూడ బీఎంఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా బైక్‌ను వెనుక వైపు నుంచి వేగంగా వచ్చి పెట్రోల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న శివకుమార్ కిందపడడంతో అతని తలపై నుంచి ట్యాంకర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వినయ్‌కుమార్‌కు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.17.33 లక్షలు పట్టివేత

ఇబ్రహీంపట్నం: స్థానిక చెరువు కట్ట వద్ద బుధవారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.17.33 లక్షల నగదును నలుగురు వ్యక్తుల నుంచి ఇబ్రహీంపట్నం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ గోవింద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్థానిక చెరువు కట్ట వద్ద వాహనాల తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మూడు కార్లు, ఒక బైక్‌లో తరలిస్తున్న 17.33 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నగదును అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

21 లీటర్ల లిక్కర్ స్వాధీనం

ఇబ్రహీంపట్నం: బెల్ట్ షాపులపై పోలీసులు దాడులు చేసి అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన ఉడుగుల యాదయ్య, మచ్చ గోవర్ధన్‌లు బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ ఇరువురి వద్ద సుమారు 21 లీటర్ల అక్రమ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

అంబులెన్స్‌లో ప్రసవం

కేశంపేట: పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవం జరిగిన ఘటన మండలంలోని పాపిరెడ్డిగూడ గ్రామ శివారులో చోటుచేసుకుంది. గ్రామస్తులు, అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని వేంకటేశ్వర హెచరీస్‌లో పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన సుష్మిత కుటుంబంతో కలిసి పనులు చేసుకుంటున్నారు. సుష్మితకు తెల్లవారు జామున పురిటినొప్పులు రావడంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగినట్లు సిబ్బంది దీపక్, సురేష్‌లు తెలిపారు. అనంతరం తల్లిపిల్లలను కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.